# 152
# బండబారిన మొండి బతుకులు

"**ఆ**కాశంబున నుండి శంభుని శిరం బందుండి శీతాద్రి సుశ్లోకంబైన హిమాద్రి నుండి భువి, భూలోకంబు నందుండి యస్తోకాంభోది..." అన్న పద్యాన్ని రాసిన కవి బహుశా మన పండరినాధ్‌నే చూసి రాసి ఉండాలి. ఆ కవిగారు ఈ పద్యం రాసేవేళకు మనవాడు లేడే అనుకుందాం. అప్పుడు మన పండరిలాంటి వాణ్ని చూసైనా రాసి ఉండాలి ఎందుకంటే ఈ పద్యం, వొక అక్షరం కూడా మర్చకుండా మన పండరికి అచ్చు గుద్దినట్లు సరిపోతుంది.

మహ్మదీయుల పరిపాలన మహోధృతంగా ఉన్న కాలమది. హిందూ రాజులందరూ మదిరతో, మగువలతో కాలక్షేపం చేస్తున్న రోజులవి. ప్రజల గోడును వినిపించుకోవడం కథల్లో తప్ప కలికానిక్కూడా కనిపించకపోయినా- కనీసం రాజ్యసంరక్షణ కోసమన్నా తంటాలు పడుతూ ఉండేవారు. ఒకప్పుడు శివాజీ నాటికి అదీ సన్నగిల్లిపోయింది. ఢిల్లీ నుండి ఔరంగజేబు సైన్యాలు, దక్షిణాదికి పొరులు కొస్తూ ఉంటే, స్థానికంగా ఉన్న రాజులు దాసోహమని లొంగిపోయారే తప్ప, కనీసం ఎదుర్కొన డానికయినా ప్రయత్నించారు కారు. అప్పుడే శివాజీ అవసరం కలిగింది. అతనేదో హిందువులందర్నీ కూడగట్టుకొచ్చాడని చరిత్రకారులు రాయడం కొంతవరకే నిజం. అతను చేసిందల్లా ఏటికొకరూ, కోటికొకరుగా ఉన్న స్థానిక పాలకుల్ని ఏకం చేయడం. మరీ లోభుల్నీ వెధవల్నీ తొలగించేసి వారి స్థానంలో తనవారిని ఉంచడం ఇదంతా మరొకరి పాలనకిందికి తన దేశం పోగూడదన్న ఇచ్ఛతోనే శివాజీ చేసాడు.

ఆ శివాజీ సైన్యానికి కావలసిన కత్తులు, కఠారులు, డాళ్లు, బల్లేలు, ఈటెలు, శిరస్త్రాణాలు ఇంకా ఇతరమైన మారణాయుధాలు తయారు చేసిన వారిలో శంభోజీ అన్న శిల్పి కూడా ఉన్నాడు. శంభోజీ భక్తి విశ్వాసాలకూ నైపుణ్యాలకు మెచ్చి శివాజీ స్వయంగా ఇచ్చిన రజత పతకం ఇప్పటికీ పూనాలోని వారి వంశీయులవద్ద ఉన్నది. శివాజీ అనేక యుద్ధాలలో విజయం సాధించడానికి, అనేక కారణాలుండవచ్చు. అందులో శంభోజీ చేసిన ఆయుధాలు కూడా వొక కారణమేనంటాడు పండరి.

ఆ రాజులూ ఆ యుద్ధాలూ పోయాయి. పోవటం మంచిది కూడా. ఆ రకమైన ఆయుధాలకు ఇప్పటి యుద్ధంలో స్థానం కూడా లేదు. కానీ చిరకాలంగా ఆ వృత్తికే అలవాటు పడి, దాన్నే నమ్ముకున్న వారందరికీ వృత్తులు పోయాయి. అందుకే వారంతా చెల్లాచెదరయిపోయారు. అటు పలాసా నుండి, ఇటు తిరుచునాపల్లి దాకా, పడమర నాందేడు దాకా- ఇంకా ఇంకా పశ్చిమానికీ, ఉత్తరానికీ కూడా వలసలు వెళ్లారు.

"మా వాళ్ళు శ్రీకాకుళం, ఆముదాలవలస, భీమునిపట్నం, విశాఖపట్నం, నరిసీపట్నం, విజయనగరం, బొబ్బిలి, కాకినాడ, సామర్లకోట, తుని, ఏలూరు, ఇంకా ఇంకా చాలా చోట్ల ఉన్నారండీ! మాదంతా వొకటేకుదురు, కానయితే మాలో మేం వొకరినొకరు చూసుకొని ఏళ్ళూ పూళ్ళూ అయింది" అన్నాడు పండరి.

వారంతా వొకే పనికూడా చేయడం లేదుట. కొంత మంది ఫ్యాక్టరీల్లో కూలీలుగా, గుమాస్తాలుగా, పళ్ళ షాపులలో పనివాళ్ళుగా, పని చేస్తున్నారు. ఇంకొంత మంది రంగులు వేయడం, సున్నాలు వేయడం, వడ్రంగం, పాత్ర సామానులు చేయడం, మారు బేరానికి గ్లాసులు, గిన్నెలు,

అమ్ముకోవడం చేస్తున్నారు. చాలా మంది మాత్రమే అసలు వృత్తిని ఇంకా అంటిపెట్టుకొని ఉన్నారు.

“ఏం ఏడిచినా బాబూ! ఆవ తీసిన గంధంలాంటిదేనండి మా సంపాదన అని ఫక్కున నవ్వాడు పండరి.”

“ఇప్పుడు కూడా, కత్తులు బాణాలు చేయడం కాదండీ! అయినా మార్పు చెందిన ఆ పనినే నమ్ముకొని ఉన్నారు. అంటే ఏమిటంటే చాకులు, కత్తెరలు, కత్తిపీటలు ఇలాంటివి ఉన్నాయనుకోండి, అవి ఎల్ల కాలం పదునుగా ఉండవుగదా! మీరు వాడుతున్న కొద్ది వాటి పదును తగ్గిపోయి బండబారి పోతాయి గదా! ఆఖరికి కాగితాలు కూడా తెగని దశ వస్తుంది గదా! అలాంటి వాటిని నేను పదును పెడతానండీ! ఇదే పల్లెటూర్లో అయితే ఏ కమ్మరి దగ్గరికో వెడతారు. ఓ అరసోలెడు గింజలు పోసి, పదును పెట్టించుకొస్తారు. మరి బస్తీలో, ఆ కమ్మరాయన ఎక్కడుంటాడో ఎప్పుడుంటాడో అందరికీ తెలియదు. అందుకని,” అన్నాడు పండరి.

ఎప్పుడుంటాడో ఎక్కడుంటాడో తెలిసినా, అతనున్న చోటకు పోవాలన్నా అతనున్నప్పుడే పోవాలన్నా అందరకూ కుదరదూ. ఉద్యోగాలకూ, పనులకు హడావుడిగా ఉరుకులూ, పరుగులూ తీసే జనానికి పదును పెట్టించుకొచ్చేంత అవకాశం ఎక్కడుంటుంది గనుక? ఉండదని పండరికి తెలుసు. అందుకే అవసరమున్న చోటుకు తనే వెడతాడు లేదా- తనే కృత్రిమంగా అవసరాన్ని కలిగించి మరీ వెడతాడు. తనిక్కడున్నానని తెలిసి చేయడానికి అతను పాడతాడు, కేకలు పెడతాడు. సానమీదనించి, ఏ ఉక్కుముక్కనో ఉంచి నిప్పు రవ్వలుచిందిస్తాడు.

“పెద్దకత్తెర సానపడితే ముప్పావలా తీసుకొంటా. చిన్నదానికైతే ముప్పయి పైసలు. రకరకాల చాకులున్నాయనుకోండి, సైజునుబట్టి 10 పైసల నుండి 50 పైసలదాకా వసూలు చేస్తా. మంగలి కత్తి పదును పెడితే 50 పైసలు తీసుకొంటానండి, మళ్ళా 15 రోజులదాకా యమాగా పని చేస్తుంది. మీరన్నది నిజమేనండి! ఇందులోనూ మోసం దగా ఉంటుంది. గీసిగీసి బేరమాడారనుకోండి, మందడి మాత్రం, వాడిగా సానేసి అవతల పడేస్తా. అడిగినంత ఇచ్చారనుకోండి, వెన్నుదగ్గర్నుంచి సవాదుగా సానపడతా. అన్నిటికి వొకే మెయినుగా సానపడితే పొట్టగడవదండీ!” అన్నాడు పండరి.

ఈ సానల్లోను చాలా రకాలున్నాయన్నాడు. మొంటుపనికోసం కొన్ని, సున్నితమైన పనికోసం కొన్ని ఉపయోగిస్తారుట తన దగ్గిర ఐదారు రకాలదాకా ఉన్నాయన్నాడు. భుజంమీద మోసుకుపోయేదానికన్నా సైకిల్‌కే అమర్చినదయితే సులువుగా ఉంటుందన్నాడు.

“కాని దాని ఖరీదు 300 నుంచి 350 దాకా ఉంటుందడీ! కొనే వోపిక లేదు. అందుకనే దీన్ని మోసుకు తిరుగుతున్నా. దీన్ని మోసినంత సేపు, నా పిల్లాణ్ణి కూడా మోయలేదండి! నా బతుకంతా దీని మీద ఆధారపడి ఉంది. అందుకే నా బిడ్డలాగా దీన్ని చూసుకొంటా” అన్నాడు పండరి ఆ సానను ఆప్యాయంగా చేత్తో నిమురుతూ.

“బాబూ! మూడు నాలుగొందల పెట్టుబడి ఉంటే సైకిల్ సాన కొంటానండీ! అప్పుడయితే ఇంకా ఎక్కువ దూరం తిరగవచ్చు. ఎక్కువ పనీ చేసుకోవచ్చు. నాలుగు పైసలు అదనంగా వస్తాయి. కానీ- ఆపాటి సాయం చేసే మారాజే కరువయి పోయాడండీ” అని ఖేదించాడు పండరి.

ఉదయం ఆరు గంటలకు ఇంట్లో బయలుదేరిన పండరి, మసక పడేదాక, తిరుగుతూనే

ఉంటాడు. ఒక్కోసారి తిరిగిన శ్రమంతా వృథా అవుతుందనీ, పావల డబ్బులు కూడా రావనీ అన్నాడు.

అయినా ఆశ అలాంటిది బాబయ్యా! నాతో బాటు ఐదుగురు బతకాలి. ముగ్గురూ ఆడపిల్లలే... ఇంకా పెళ్ళిళ్ళు చేయాలి. అప్పటికి, మా ఇంటిది నసపెడుతూనే ఉంటుంది. నన్నేం చేయమంటారో చెప్పండి. ఇట్టా పొట్టకే తిప్పలుపడనా, అటు ఎదిగిన ఆడపిల్లలు పెళ్ళిళ్ళే చేయనా, నేను చూస్తావున్నానండీ ఆఖరికి ఎప్పుడో పిచ్చెక్కుతుంది... అప్పుడు-'' అని సాన ఇరుసుకు పక్కగా వేళ్ళాడదీసిన చాకుల వేపు చూశాడు పండరి.

అతనేదయినా అఘాయిత్యం చేసినా తనకు తను చేసుకొన్నా ఆడిపోసుకోవడానికి మనమంతా సిద్ధంగా వున్నాం. అంతదాకా రాకముందే అతనికింత సాయపడడానికి మనకెవ్వరికి ప్రాణం వొప్పదు.

అవును! మనతీరే అలాంటిది!!